ఈనాడు ఒడిశా

శుక్రవారం అక్టోబరు 25, 2024

నేటి సాయంత్రం వరకు ప్రభావం

ఐఎండీ రెడ్ అలర్ట్

శనివారం వరకు వర్షాలు

యంత్రాంగం గట్టి నిఘా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపానును సమర్థంగా ఎదుర్కోవాలని, ప్రాణ నష్టం లేకుండా నివారించాలన్న లక్ష్యంతో యంత్రాంగం ముందు జాగ్రత్తలు చేపట్టింది. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి గురువారం రోజంతా భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంత్రులు, అధికారులను క్షేత్రస్థాయిలో దిశా నిర్దేశం చేశారు.



వృద్ధురాలిని మోసుకెళుతున్న ఆశా కార్యకర్త

లోపాలకు తావీయొద్దు

దానా తీవ్రత అంతగా ఉండదని ఐఎండీ అధికారులు అంచనా వేశారు. తుపానుకు కేంద్ర బిందువు లేనందున గాలి తీవ్రత తగ్గొచ్చన్న సమాచారం ఎస్ఆర్‌సీ దేవ్‌రంజన్ కుమార్ సింగ్‌కు అందజేశారు. అలాగని విపత్తును తక్కువగా అంచనా వేయలేదు. 3.62 లక్షల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆయా చోట్ల అనుభవం గల అధికారులను నియమించారు. వారికి సహాయం చేయడానికి సేవా సంస్థల కార్యకర్తలను సన్నద్ధం చేశారు. ఎక్కడా లోపాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

మంత్రుల పరిశీలన

ప్రభావితం కానున్న జిల్లాల్లో 9 మంది మంత్రులు, ఆరుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. అధికారులకు సూచనలు చేశారు. ఆయాచోట్ల ప్రజల ఇబ్బందులు స్వయంగా అధ్యయనం చేశారు. రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి గురువారం ఉదయం 10 గంటలు, మధ్యాహ్నం 2 గంటలు, సాయంత్రం 6 గంటలకు లోక్‌సేవాభవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఎస్ఆర్‌సీ సింగ్ ఇతర అధికారులతో పరిస్థితి సమీక్షించారు.

సహకరించిన కేంద్రం


తుపానును దృష్టిలో పెట్టుకుని కేంద్రం రాష్ట్రానికి 30 ఎన్డీఆర్ఎఫ్ దళాలు, హెలికాప్టరు కేటాయించింది. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ముఖ్యమంత్రి మోహన్‌తో మాట్లాడి సహాయ కార్యక్రమాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

తొమ్మిది జిల్లాలపై ప్రత్యేక దృష్టి



సేవలకు సిద్ధంగా ఎన్డీఆర్ఎఫ్ దళం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: దానా తుపాను ప్రభావం తొమ్మిది జిల్లాలపై ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పశ్చిమ, తూర్పు మిద్నాపూర్, ఝార్‌గ్రామ్ జిల్లాలున్నాయి. దిఘా పర్యాటక ప్రాంతంలో రెడ్ ఎలెర్ట్ జారీ చేసింది. ముప్పును సమర్థవంగా ఎదుర్కొనేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దిఘా శంకర్ పూర్ అథారిటీ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ మానస్ రంజన్ పాల్గొన్నారు. మార్కెటు మూసివేసి, సముద్రం వైపు ఎవరూ రాకుండా చర్యలు తీసుకున్నారు. దానా తుపాను తీరం దాటే సమయంలో 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీయవచ్చునని అంచనా వేస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. ఖరగ్‌పూర్ మండలం 25, 26 తేదీల్లో పలు రైళ్లు రద్దు చేసింది.



గోపాలపూర్, న్యూస్‌టుడే: దానా తుపాను ప్రభావాన గురువారం తీర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. గాలులు వీచాయి. గాలుల తీవ్రత కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్ జిల్లాల్లో అధికంగా కనిపించింది. ఈ విపత్తు నేపథ్యంలో ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు ఐఎండీ కొనసాగించింది. గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్‌దాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.... శుక్రవారం సాయంత్రం వరకు దానా ప్రభావం రాష్ట్రంపై ఉంటుందని శనివారం వరకు వర్షాలకు అవకాశం ఉందని తెలిపారు.

శ్రీక్షేత్రం రహదారిలో ఇలా...



పూరీ తీరం



మూడు జిల్లాల్లో గాలులు


కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్ జిల్లాల్లో గురువారం సాయంత్రం 4 గంటల వరకు గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయన్నారు. జగత్సింగ్‌పూర్, పూరీ జిల్లాల్లో 50 నుంచి 60 కిలోమీటర్ల తీవ్రత నమోదైందన్నారు. గంజాం జిల్లాలో 30 నుంచి 35 కిలోమీటర్లలోపుగా ఉన్నట్లు తెలిపారు. గాలుల తీవ్రత పెరుగుతుందని, శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగనుందన్నారు.

పరదీప్‌లో ఎక్కువ వర్షపాతం

పరదీప్‌లో అత్యధిక వర్షపాతం 62.9 మిల్లీమీటర్లుగా నమోదు కాగా, చాంద్‌బలిలో 46.2, చందన్‌పూర్‌లో 29.2, కుజంగ, రాజ్‌కనికాలో 27, రాజ్‌నగర్‌లో 24, నీలగిరిలో 23, పట్టాముండైలో 22, ఒళిలో 21 మిల్లీమీటర్లుగా ఉందన్నారు. పూరీ, గోపాల్‌పూర్‌లో 10 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఉమాశంకర్‌దాస్ చెప్పారు.

నేడు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు

శుక్రవారం జగత్సింగ్‌పూర్, కేంద్రపడ, కటక్, భద్రక్, జాజ్‌పూర్, బాలేశ్వర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు (20 సెంటీమీటర్ల చొప్పున) కురుస్తాయన్న అంచనాతో 'రెడ్' అలర్ట్ ప్రకటించామన్నారు. పూరీ, ఖుర్దా, కేంఝర్, నయాగఢ్, ఢెంకనాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నందున ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశామన్నారు. గంజాం, బౌద్ధ్, అనుగుల్, దేవ్‌గఢ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, సుందర్‌గఢ్, కొంధమాల్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయన్న అంచనాతో ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. దానా ప్రభావంతో శనివారం వరకు రాష్ట్రంలో వర్షాలకు అవకాశం ఉందని దాస్ చెప్పారు.



దానా తుపాను దృశ్యం

గోపాల్‌పూర్ బీచ్‌రోడ్ మూసివేత



తీర ప్రాంతాలు మూసివేత

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని తీర పర్యాటక కేంద్రాలను మూసివేయడంతో గురువారం అవి నిర్మానుష్యంగా కనిపించాయి. పూరీ తీరంలో ఎర్రజెండాలు కట్టారు. గోపాల్‌పూర్ దీపస్తంభం ఆవరణలో అడ్డుగా గేటు ఏర్పాటు చేసి వాహనాలు, జనాలు తీరం వైపునకు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో నిత్యం సందర్శకులతో కళకళలాడే స్వర్గద్వారం పార్కు, తీరం వెలవెలబోయాయి. రెవెన్యూ, ఎస్పీసీ అధికారులు, పోలీసులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. బీచ్‌రోడ్‌లో హోటళ్లు, ఇతర వ్యాపారాలు మూతపడ్డాయి.

ఆసుపత్రుల్లో 2,388 మంది గర్భిణులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావిత జిల్లాల్లో గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 2,388 మంది గర్భిణులకు ఆసుపత్రుల్లో చేర్పించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ చెప్పారు. ఆయన అధికారులతో పరిస్థితిపై భువనేశ్వర్‌లో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ నెల 31 లోగా ప్రసవించే అవకాశం ఉన్నవారి జాబితా సిద్ధం చేసిన యంత్రాంగం వారిని ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పునరావాస కేంద్రాల్లో పాముకాటు విరుగుడు, అతిసారం, జ్వరాలు తగ్గించేందుకు ఇంజెక్షన్లు, మందులు సిద్ధంగా ఉంచామన్నారు.



కేంద్రపడ జిల్ల రాజ్‌నగర్ ఆసుపత్రిలో గర్భిణులు

కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్‌లలో అప్రమత్తం

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను తీవ్రమైంది కాదని, స్వల్పంగా ప్రభావం చూపుతుందని వాతావరణ అధ్యయనశాఖ (ఐఎండీ) గురువారం అంచనా వేసింది. దీంతో పునరావాసకేంద్రాలకు ప్రజల తరలింపు సంఖ్య తగ్గించారు. తొలుత 15 నుంచి 18 లక్షల మందికి తరలిస్తారని రెవెన్యూ, విపత్తుల నివారణశాఖల మంత్రి సురేష్ పూజారి చెప్పారు. తరువాత ఈ సంఖ్యను 3.62 లక్షలకు కుదించారు. కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్ జిల్లాలపైనే యంత్రాంగం దృష్టి సారించి జాగ్రత్తలు తీసుకుంది.

నదుల్లోకి ఉప్పునీరు చేరే అవకాశం

కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్ జిల్లాల్లో వైతరణి, రజువా, ఇతర ఉపనదులున్నాయి. ఆయాచోట్ల ఉప్పుటేర్లున్నాయి. అవి సముద్రంతో అనుసంధానమై ఉన్నాయి. తుపాను తీరం దాటే సమయంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. రాకాసి అలలు ఏటి మార్గాల్లో నదుల్లోకి ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో నదీజలాలు కలుషితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.



అధికారులతో మోహన్ సమీక్ష

ప్రాణనష్టం నివారణకు చర్యలు



పునరావాస కేంద్రానికి చిన్నారిని తరలిస్తున్న పోలీసు అధికారి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో ప్రాణ నష్టం నివారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, పరిస్థితిపై గట్టి నిఘా ఉంచినట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. గురువారం మధ్యాహ్నం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ తుపాను వివరాలు, తీసుకున్న జాగ్రత్తల గురించి అడిగారని, ఆయనకు అంతా తెలియజేశామన్నారు. దిల్లీలో జరిగిన కేబినెట్ సమావేశంలో తుపాను విషయం ప్రస్తావనకొచ్చిందని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ప్రధానికి అంతా తెలియజేశారన్నారు. ఇంతవరకు కేంద్రం అడిగిందంతా కేటాయించిందని, ఇంకేం సహాయం కోరినా చేస్తామని ప్రధాని పేర్కొన్నట్లు తెలిపారు.

1,653 గ్రామాలకు ముప్పు

దానా వల్ల 1,653 గ్రామాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయని యంత్రాంగం అంచనా వేసిందన్నారు. ఇంతవరకు 7,285 పునరావాస కేంద్రాలు సిద్ధం చేశామని, 3 లక్షల మందిని తరలించినట్లు తెలిపారు. 92 వైద్య బృందాలు, 58 చికిత్స బృందాలు ప్రభావిత ప్రాంతాల్లో సేవలకు సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఓడ్రాఫ్, అగ్నిమాపక, పోలీసు బలగాలను సహాయ కార్యక్రమాలకు నియమించామన్నారు. రెడ్‌క్రాస్, ఇతర సేవాసంస్థల ప్రతినిధులూ ప్రభుత్వానికి సహకరిస్తున్నారన్నారు. తుపాను తరువాత విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగొచ్చని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు, సరఫరా పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

దొంగల భయం.. గ్రామాలొదిలి రాలేం..

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: దానా తుపాను ముప్పుతో సతమతమవుతున్న పీడీత ప్రజలకు మరోవైపు దొంగల భయం వెంటాడుతోంది. జగత్సింగ్‌పూర్ జిల్లాలో చాలా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు విముఖత చూపుతుండడం ఇందుకు నిదర్శనం. తుపాను ప్రభావం నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నా ఆయా గ్రామస్థులు ససేమిరా అంటున్నారు. జగత్సింగ్‌పూర్ జిల్లాలోని ఎరసమ, కుజంగ్, పరదీప్, బలికుద, నావుగావ్ తదితర గ్రామాలకు దానా తుపాను ముప్పు పొంచి ఉంది. అయినా ఆయా గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. దొంగల భయంతో ఇళ్లను విడిచి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో దాదాపు 200 చోరీ కేసులు నమోదు కావడాన్ని ఇందుకు ఉదహరిస్తున్నారు. ఇళ్లతోపాటు మందిరాలనూ దొంగలు వదలడం లేదని, దాదాపు 10 ఆలయాల్లో చోరీలు జరిగాయన్నారు. మందిరాలు, ఇతరత్రా ప్రదేశాల్లో ఎర్రచందనం చెట్లను సైతం దొంగతనం చేశారని గుర్తుచేశారు. గొడ సర్పంచి బిశ్వకల్యాణి నాయక్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో తాజాగా 20 వరకు దొంగతనం కేసులు నమోదుయ్యాయని పేర్కొన్నారు. జిల్లాలోని 8 సమితిల పరిధిలో 938 గ్రామాలను తుపాను పీడిత ప్రాంతాలుగా గుర్తించినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది.



సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని గ్రామస్థులకు చెబుతున్న అధికారులు

రక్షిత కేంద్రాలకు తరలింపు



పాత్రపురంలోని తాత్కాలిక ఆశ్రయ కేంద్రానికి చేరుకున్న భగలటి జలాశయం అవతలివైపునున్న ఆదివాసీ గ్రామాల ప్రజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని సాగర తీరం, నదులు, చిలికా ఒడ్డున నివాసముంటున్న ప్రజల్ని సమీపంలోని తుపాను రక్షిత కేంద్రాలకు తరలింపు పనులు చకచకా నిర్వహించారు. జిల్లాలో సుమారు 25 వేల మందిని కేంద్రాల్లో ఉంచాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం 109 బహుళ వినియోగ తుపాను రక్షిత కేంద్రాలుండగా, అదనంగా మరో 700 తాత్కాలిక కేంద్రాలను యంత్రాంగం సిద్ధం చేసింది. ఆయాచోట్ల బాధితులకు వంటలు వండి అందించడంతోపాటు మరికొన్ని చోట్ల అటుకులు, బెల్లం వంటివి అందజేస్తున్నారు. గంజాం జిల్లా పాలనాధికారి దివ్య జ్యోతి పరిడా, బ్రహ్మపుర సబ్‌కలెక్టరు దీనహ దస్తాగీర్, భంజనగర్ సబ్‌కలెక్టరు అనిల్ కుమార్ సెఠిలు గురువారం వివిధ చోట్ల ఆశ్రయ కేంద్రాల్లో పరిస్థితిని పరిశీలించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన పశువుల కోసం ఆహారం అందించేందుకు పచ్చగడ్డిని గంజాం జిల్లా ముఖ్య పశు వైద్యాధికారి (సీడీవీఓ) కార్యాలయంలో సిద్ధంగా ఉంచినట్లు జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి రబినారాయణ బెహరా గురువారం తెలిపారు.



భంజనగర్ సమితిలో తురుములోని ఆశ్రయ కేంద్రంలో వంటలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టరు, ఇతర అధికారులు



గంజాం సమితిలో గోఖురకుదాలోని ఆశ్రయ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పాలనాధికారి పరిడా. చిత్రంలో సబ్‌కలెక్టరు దస్తాగీర్

కట్టుదిట్టంగా పోలీసు భద్రత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా యంత్రాంగం చేపట్టిన తుపాను ముందస్తు చర్యలకు బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. తుపాను ఆశ్రయ కేంద్రాల వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేసింది. సాగర తీరాలకు సందర్శకులు రాకుండా రహదారులపై అడ్డంగా తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు తీరాల్లో పోలీసులను మోహరించింది. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా వారి పడవల వద్ద పోలీసుల కాపలా ఏర్పాటు చేసింది. గోపాలపూర్, గొళంత్రా, సున్నాపురం మెరైన్ పోలీసు స్టేషనలలో మూడు పటాలాల బలగాలను సిద్ధంగా ఉంచామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. గురువారం మధ్యాహ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఠాణాల పరిధుల్లో సాగర తీరాల్లో బలగాలతో గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ చోట్ల కొండలపై నివాసముంటున్న వారిని ఒప్పించి సమీపంలోని ఆశ్రయ కేంద్రాలకు తరలించామని ఎస్పీ వెల్లడించారు.



సున్నాపురం సాగర తీరం వద్ద సందర్శకులు రాకుండా పోలీసు భద్రత



కొండపై ఉన్న ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు

ముఖ్యమంత్రి మోహన్ సమీక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి గురువారం భువనవేశ్వర్‌లోని ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయానికి వెళ్లారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహుజా, ఎస్ఆర్‌సీ దేవ్‌రంజన్‌కుమార్ సింగ్, ఇతర ఉన్నతాధికారులతో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలు, పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. సీఎంతో కలసి రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి కూడా పరిస్థితిపై సమీక్షించారు. శాటిలైట్ ఫోన్‌లు, ఇతర సామగ్రి పరిశీలించారు. ఇక్కడ వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అధికారి నీరజ్‌మెహతా ముఖ్యమంత్రికి 'దానా' కదిలికలు శాటిలైట్ చిత్రం ద్వారా చూపించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ... తుపాను తరువాత చేపట్టాల్సిన సహాయ కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చామని, బాధితలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఓడ్రాఫ్, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ జవానులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

పాలనాధికారులకు సూచనలు

ముఖ్యమంత్రి మోహన్ ఉత్తరకోస్తా, తీర జిల్లాల పాలనాధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. సహాయ కార్యక్రమాల్లో లోపాలుండకూడదని, పునరావాసకేంద్రాల్లో ఉన్నవారు ఇబ్బందులకు గురి కాకూడదని పేర్కొన్నారు.



తుపాను చిత్రం గురించి సీఎంకు తెలియజేస్తున్న ఐఎండీ అధికారి. పక్కన మంత్రి సురేష్

ఓపీఎస్‌సీలో మెరిసిన బోండా యువతి

- 596వ ర్యాంకు సొంతం చేసుకున్న ఆదిమగిరిజన తెగకు చెందిన బిని

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆదిమ గిరిజన తెగ (పీవీటీజీ)కు చెందిన ఓ యువతి ఓపీఎస్‌సీ పరీక్షలో సత్తాచాటింది. తాజాగా విడుదలైన ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) పరీక్షా ఫలితాల్లో 596వ ర్యాంకు సొంతం చేసుకుంది. మల్కాన్‌గిరి జిల్లా గోవిందపల్లె పంచాయతీ ఖెముగడ గ్రామానికి చెందిన బోండా గిరిజన యువతి బిని ముదులి ఓపీఎస్‌సీలో మెరిసింది. ఆమె తండ్రి రామ్ ముదులి ముదులిపొడ ఉన్నత పాఠశాలలో వంట మనిషి (కుక్)గా పనిచేస్తుండగా, తల్లి సునామణి కిర్సాని అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. బిని సాధించిన విజయం బొండా గిరిజనుల్లో ఆనందాన్ని నింపింది.



బిని ముదులి

తెల్లవారుజాము తీరం దాటనున్న దానా

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ధమా, బితర్‌కనికల మధ్య తీరం దాటనుందని గోపాల్‌పూర్ ఐఎండీ కేంద్రం అధికారి ఉమాశంకర్‌దాస్ గురువారం సాయంత్రం 6.30 గంటలకు చెప్పారు. ఈ ప్రక్రియకు చాలా సమయం పడుతుందని, ఉదయం 8 గంటల వరకు గాలుల తీవ్రత, వర్షాలుంటాయన్నారు. ఉత్తరపశ్చిమ దిశగా తీరం వైపునకు కదులుతున్న ఈ విపత్తు పరదీప్‌కు దక్షిణ తూర్పుదిశలో 150 కి.మీ. దూరంలో, ధమ్రాకు 180 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. గడిచిన 6 గంటలుగా గంటకు 10 కిలోమీటర్ల వేగంతో తీరం వైపునకు వెళుతోందన్నారు. పరదీప్, ధమ్రా, పూరీ ఓడరేవులకు 10వ నంబరు, గోపాల్‌పూర్‌కి 3వ నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశామన్నారు. తుపాను కదలిక (ప్రయాణం) అంతకంతకు తగ్గితే తీరం దాటడం ఆలస్యమవుతుందని, వేగంగా కదిలితే నిర్ణీత వ్యవధిలో (3 గంటలు) అతిక్రమించే అవకాశం ఉందన్నారు.

పెరుగు గారెల కోసం కుమార్తెను చంపిన తల్లి

- నయాగఢ్ జిల్లాలో దారుణం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పెరుగు గారెలు కోసం 14 ఏళ్ల కుమార్తెను సవతి తల్లి తీవ్రంగా కొట్టి హతమార్చిన దారుణ ఘటన నయాగఢ్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. జిల్లాలోని ఫతేగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలను పోలీసులు ఇంతవరకు వెల్లడించలేదు. స్థానికుల సమాచారం ప్రకారం.. బావుసబ్బతి పంచాయతీ పరిధి పొడసాహిలో నివాసముంటున్న ఓ 14 ఏళ్ల బాలిక తనకు చెప్పకుండా పెరుగు గారెలు తిందన్న కోపంతో సవతి తల్లి తీవ్రంగా కొట్టింది. దెబ్బలకు తాళలేక బాలిక మృతి చెందగా, ఆమె మృతదేహాన్ని నిర్మానుష్య ప్రాంతంలో పాతిపెట్టేందుకు నిందితురాలు ప్రయత్నించింది. పోలీసులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. నిందితురాలి వివరాలు, హత్యకు గల కారణాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. ప్రస్తుతానికి విచారణ కొనసాగుతోందని, అప్పుడే ఏ వివరాలు చెప్పలేమన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో 16 రోజుల క్రితం కనిపించకుండా పోయిన బాలుడు మృతదేహం బుధవారం అడవిలో కనిపించింది. ఎస్సై లక్ష్మీ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జోరిగావ్ పట్టణానికి చెందిన సుభాష్ పాండే కుమారుడు క్షీర్‌ధర్ పాండే (15) ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవటంతో 10వ తేదీన సుభాష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం గురుసింగ గ్రామానికి చెందిన మహిళలు అడవిలో కట్టెలు కోసం వెళ్లి బాలుడి మృతదేహాన్ని చూసి పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు క్షీర్‌ధర్ పాండే మృతదేహంగా గుర్తించారు. అనంతరం పరీక్షకు తరలించారు.. పోలీసులు హత్య లేక ఆత్మహత్యకోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పరీక్ష నివేదిక అనంతరం పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని ఎస్‌డీపీవో మధుసిక్తామిశ్రా తెలిపారు.

ఉమ్మర్‌కోట్‌లో యువతి ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితిలో యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జా గ్రామానికి చెందిన మనిషా హల్దార్ (19) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంకాకు ఉరేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరీక్షకు తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రూ.4 లక్షలు విలువైన గంజాయి స్వాధీనం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అక్రమ గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు, ఆబ్కారీ అధికారులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మోహన సమితి అడవా ఠాణా పరిధిలో ఎస్సై ప్రశాంత్ చంద్ర పలకా ఓ బృందంతో గురువారం బలియాగూడ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అటువైపు మ్యాక్స్ పికప్ వ్యాన్ వెళ్లింది. అనుమానంతో బృందం వాహనాన్ని సోదా చేశారు. 70 కిలోల 700 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ. 4లక్షలు ఉంటుందని ఠాణా అధికారి సుబ్రంత్ పండా వెల్లడించారు. నిందితుడుపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

సోదాల్లో...

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే బుధవారం రాత్రి బలిమెల పట్టణం కూడలి వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో నకామాముడి గ్రామం వైపు నుంచి గోవిందపల్లి రహదారిపై వేగంగా వెళ్తున్న కారును ఆపడానికి ప్రయత్నించారు. కారు ఆగకుండా వెళ్లిపోయింది. వెంబడిస్తున్న సమయంలో నిందితులు కుడుములుగుమ్మ గ్రామం పెట్రోల్ పంప్ వద్ద వాహనం ఆపి పరారయ్యారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చెయగా 288 కిలోల గంజాయిని లభ్యమైంది. దీని విలువ రూ. 25 లక్షలు పైగా ఉంటుందని బలిమెల ఠాణా అధికారి ధిరేన్ పట్నాయక్ చెప్పారు.

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అక్రమ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నందపూర్ ఎస్‌డీపీఓ సంబిత్ కుమార్ మజ్జి అందించిన వివరాల ప్రకారం.. పాడువా నుంచి సిమిలిగుడకు కారులో గంజాయి అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. గురువారం ఉదయం కిల్వ కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓ కారులో లభ్యమైన గంజాయిని తూనిక చేయగా 50 కిలోలు ఉన్నట్లు తేలింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నారు.

వారపు సంత వద్ద జూదం, కోళ్ల పందెం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎమ్.వి. 79 ఠాణా టిగల్ గ్రామంలో జరుగుతున్న వారపు సంతలో ప్రతిరోజు జూదం, కోళ్ల పందెం జరుగుతోంది. బుధవారం వారపు సంతలో జూదం, కోళ్ల పందెంపై గిరిజనులు ప్రభుత్వానికి, పోలీసులకు సమాచారం అందించలేదు. గ్రామస్థులు ఎమ్.వి. 79 ఠాణా అధికారి సుబాష్ కర్మరాని సంప్రదించగా దీనిపై ఎటువంటి సమాచారం అందలేదన్నారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టుబడ్డ బాణసంచా

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్ల బలిమెల పోలీసులు ఓ బంగాళదుంపలు వ్యాన్‌లో దీపావళి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. బలిమెల జయపుడ్ ముఖ్య రహదారిపై గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అటుగా వస్తున్న బంగాళాదుంపల వ్యాన్ ఆపి పరిశీలించారు. బస్తాలు కింది దీపావళి సామగ్రి లభ్యమైంది. వాహనచోదకుడిని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించినట్లు బలిమెల ఠాణా అధికారి ధిరేన్ పట్నాయక్ తెలిపారు.

చరవాణి దుకాణంలో చోరీ

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ గ్రామంలో ఓ చరవాణి దుకాణంలో దొంగతనం జరిగింది. వివరాలకు వెళ్తే బుధవారం రాత్రి చిత్రకొండ గ్రామ ముఖ్య రహదారిలోని సంజయ్ దాసా చరవాణి దుకాణం పైకప్పు పగలగొట్టి దుకాణం లోపల నుంచి ఖరీదైన 10 చరవాణిలు, పవర్‌బ్యాంక్‌తో పాటు ఇతర సామగ్రి దొంగతనం చేశారు. గురువారం ఉదయం యజమాని చూసి చిత్రకొండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. నాలుగు నెలల క్రితం ఇదే దుకాణంలో చోరీ జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఠాణా అధికారి ముకుందా మెల్కా చెప్పారు.

న్యాయం కోసం రాస్తారోకో

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో ఇంజెక్షన్ వికటించడంతో బాలింత మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసి, బాధితులకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పపడాహండి - ఉమ్మర్‌కోట్ రహదారిపై బారిగూడ చౌక్ వద్ద మృతదేహంతో కుటుంబీకులు, గ్రామస్థులు రాస్తారోకో చేశారు. రూ.20 లక్షలు నష్టపరిహారం కావాలని డిమాండ్ చేశారు, ఘటనా స్థలానికి చేరుకున్న డాబుగావ్, పపడాహండి తహసీల్దార్లు హరిఓం భోయి, సస్మిత జెన్నా, ఉమ్మర్‌కోట్, పపడహండి ఎస్‌డీపీవోలు మధుస్మిత మిశ్రా, మీనాక్షి రాఖర్, పపడహండి ఐఐసీ దీపక్ కుమార్ జెన్నా, ఆందోళనకారులను నచ్చజెప్పి, రెడ్‌క్రాస్‌నిధి ద్వారా రూ.10వేలు అందజేయగా నిరసనకారులు శాంతించారు. పోలీసులు ఏఎస్‌ఐ మీన బారల్, అంగన్‌వాడీ కార్యకర్త అంబిక శాంతాను అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.


రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సహాయ కార్యక్రమాలకు సిద్ధమైన ఇండియన్ నేవీ


సహాయ కార్యక్రమాలకు రబ్బరు పడవలు సిద్ధం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పెను తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సేవలు అందించేందుకు, సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వం కోరితే సహకరించేందుకు ఇండియన్ నేవీ జవానులు సిద్ధమయ్యారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో హ్యూమనిటేరియన్ అసిస్టెన్స్, డిజాస్టర్ రిలీఫ్ (హెచ్ఏడీఆర్) ఆపరేషన్స్ నిర్వహించేందుకు అది అన్ని ఏర్పాట్లు చేసిందని రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ నేవీ శిక్షణా కేంద్రం 'ఐఎన్ఎస్ చిలికా' అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆంధ్ర, ఒడిశా, పశ్చిమబంగాల్‌లోని ఆఫీసర్ల ఇన్‌ఛార్జితో సమన్వయంగా సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. దుస్తులు, తాగునీరు, ఆహారం, ఔషధాలు, అత్యవసర సహాయ సామగ్రితో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితుల్ని ఆదుకునేందుకు కూడా సిబ్బంది సిద్ధమని ఆ ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న మేయరు దొళాయి, కార్పొరేటరు సాబత్ తదితరులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ)లోని 38వవార్డులో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ జరిగింది. బుధవారం ఆ వార్డులోని ఆనంద విహార్‌లో మేయరు సంఘమిత్ర దొళాయి, ఉపమేయరు వివేక్‌రెడ్డి ఈ కార్యక్రమంలో చేశారు. వీటితోపాటు ఆయా చోట్ల మొక్కలు నాటారు. వార్డు కార్పొరేటరు స్వర్ణలత సాబత్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆందవిహార్, రామ్‌విహార్ ప్రాంతాల్లో కొత్తగా రహదారులు, మురుగుకాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె తెలిపారు.

విరిగిన చెట్లు


అస్తరంగ వద్ద విరిగిన చెట్లు తొలగిస్తున్న జవానులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా అస్తరంగ సమితి రోడ్‌లో గురువారం ఉదయం చెట్లు విరిగాయి. జిల్లాలోని నిమపడ రహదారిలోనూ చెట్లు నేలకూలాయి. కేంద్రపడ జిల్లా రాజ్‌నగర్‌లోనూ కొన్నిచోట్ల ఇదే పరిస్థితి కనిపించింది. భద్రక్ జిల్లా ధాంనగర్ వద్ద సరుగుడు, జీడి చెట్లు విరిగాయి. ఆ ప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులులు వీచాయి. ఈ నేపథ్యంలో ఓడ్రాఫ్, అగ్నిమాపక జవానులు రోడ్లపై అడ్డంగా పడిన చెట్లు నరికి రాకపోకలకు అంతరాయంలేకుండా పనులు చేశారు.

క్రీడాకారులకు అభినందన


పసిడి, రజత, కాంస్యపతకాలతో రాష్ట్ర క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగిన 24వ జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. పోటీల్లో పన్నెండుమంది పురుషులు, మహిళా క్రీడాకారులు 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ తదితరాంశాల్లో 13 పసిడి, 10 రజత, 3 కాంస్యపతకాలు గెలుచుకున్నారు. ఈమేరకు రాష్ట్ర క్రీడా విభాగం ఆయా వివరాలను 'ఎక్స్'లో వెల్లడిస్తూ పతకాల విజేతలకు అభినందనలు తెలిపింది. బుధవారం రాష్ట్రానికి చేరుకున్న విజేతలకు భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ విమానాశ్రయంలో క్రీడావిభాగం అధికారులు, రాష్ట్ర పారా క్రీడల సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు.

పోటీల్లో స్టార్-II ఛాంపియన్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం దసరా పోడియా మైదానంలో గత 10 రోజులుగా జరుగుతున్న అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా జయపురానికి చెందిన స్టార్-11 జేసీఎల్ జట్టు నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన స్టార్ జట్టు 15 ఓవర్లలో 188 పరుగులు తీసింది. ప్రత్యర్థి జట్టు నువాపడ 183 రన్స్ మాత్రమే చేసి ఓటమి పాలైంది. శాసనసభ్యుడు తారా ప్రసాద్ బాహినిపతి విజేత జట్టుకు రూ.1,11,111 విలువ చేసే చెక్కుతో ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌కు ట్రోఫీ, రూ.77,777 చెక్కు ఇచ్చారు. నిర్వాహకులు ఈవెనింగ్ క్లబ్ సభ్యులు సమీర్, చందన్, సత్యనారాయణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న శాసనసభ్యుడు

సైక్లింగ్‌లో స్వస్తిసింగ్‌కు పసిడి పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హరియాణాలోని సోనిపట్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన ఖేలోఇండియా మహిళా జాతీయ రోడ్ సైక్లింగ్ తుది పోటీలో రాష్ట్ర క్రీడాకారిణి స్వస్తి సింగ్ పతకాలు సాధించింది. ఇందులో 20 కిలో మీటర్ల వ్యక్తిగత టైం ట్రయల్, 30 కిలోమీటర్ల మాస్ స్టార్ట్ అంశంలో రెండు పసిడి పతకాలు దక్కించుకుంది. రవుర్కెలాకు చెందిన స్వస్తి వచ్చే నెలలో చెన్నైలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది.


పసిడిపతకాలతో స్వస్తిసింగ్


కొరాపుట్ రాధో శర్మ కాలనీ వద్ద చెత్త

కాలుష్య కోరల్లో కాలనీ వాసులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాధో శర్మ కాలనీ వాసులు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మిషన్‌శక్తి ఆధ్వర్యంలో వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువు తయారు కేంద్రం ఉంది. దీనికి సంబంధించి ముడిసరకును గుట్టలు, గుట్టలుగా పడేయడంతో కొండలా కనిపిస్తోంది ఈ కేంద్రానికి సమీపంలోని రాధోశర్మ కాలనీ వాసులు వ్యర్థాలు నుంచి వస్తున్నా దుర్గంధం భరించలేకపోతున్నారు. అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చిన ఫలితం లేదని సామాజిక కార్యకర్త నందకిషోర్ గురు తెలిపారు. దీన్ని జనావాసాలకు దూరంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

బిజాఘటి పంచాయతీపై చిన్న చూపు


తబ పోదోరోలో బాధితుడును పరామర్శించిన ఎమ్మెల్యే పవిత్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నారాయణ పట్టణం సమితి బిజా ఘటి పంచాయతీపై నాల్కో యాజమాన్యం చిన్న చూపు చూస్తోందని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత ఆరోపించారు. గురువారం ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించారు. తొలి సారిగా గిరిజన గ్రామాల్లో సందర్శించడంతో స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కిరో జ్వాలా, తబ పోదోతోలో గడిలి ,బిజా ఘటి ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి ఆయా గ్రామాల సమస్యలు తెలుసుకున్నారు. నాల్కో గనుల ప్రాంతానికి సమీపంలో ఉన్న నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించ లేదని ప్రాంతవాసులు ఆరోపించారు. నాల్కో యాజమాన్యం తీరుపై ఎమ్మెల్యే పవిత్ర శాంత విరుచుకుపడ్డారు. దీనిపై కలెక్టర్‌తో పాటు నాల్కో కార్యనిర్వాహక సంచాలకులుతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్, ఝార్సుగుడ విమానాశ్రయాలకు గురువారం సాయంత్రం బాంబులున్నట్లు ఫోన్‌కాల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఈ రెండుచోట్ల ప్రతి అంగుళం గాలించారు. బాంబులు లేవని నిర్ధారించారు. ఈ ఫోన్‌కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయన్న దానిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు భువనేశ్వర్ విమానాశ్రయం సంచాలకుడు ప్రసన్నకుమార్ ప్రధాన్ విలేకరులకు చెప్పారు.

ప్రారంభమైన రహదారి పనులు


ఇందిరా నగర్‌లో రోడ్డు పనులు పరిశీలిస్తున్న రాజేంద్ర తదితరులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ పురపాలక సంస్థ పరిధిలో వివిధ వార్డుల్లో రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. కొంతకాలంగా మరమ్మతులు జరగలేదు. రాకపోకలకు ఇబ్బందులు పడిన స్థానికులు రహదారులు బాగు చేయాలని డిమాండు చేశారు. స్పందించిన యంత్రాంగం పనులు ప్రారంభించారు. డిసెంబర్‌కి అన్ని రహదారులు మెరుగుపరుస్తామని పురపాలక సంస్థ అధికారులు ప్రకటించారు. గురువారం ఇందిరానగర్‌లో జరుగుతున్న పనులను పురపాలకఅధ్యక్షులు రాజేంద్రకుమార్ పాత్రో, ఇతర అధికారులు పరిశీలించారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో?


నిత్యం రద్దీగా పాతబస్టాండు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం పట్టణం పాత బస్టాండులో ట్రాఫిక్‌తో ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో ఈ బస్టాండుకు అన్ని బస్సులు వచ్చేవి. ట్రాఫిక్ దృష్ట్యా రైల్వే స్టేషన్ సమీపంలో కొత్త బస్టాండు నిర్మించారు. అప్పట్లో ప్రధాన రహదారికి ఒక వైపు ద్విచక్రవాహనాలు ఉంచేందుకు స్టాండు ఏర్పాటు చేశారు. దీంతో పాటు చిన్న చిన్న దుకాణాలు ఉండేవి. రెండో వైపు ఉన్న తోపుడు బళ్లతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పోలీసు కానిస్టేబులు ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చున స్థానికులు అంటున్నారు. ద్విచక్రవాహనాలు నిలిపేందుకు వేరే చోట స్థలం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్పంచి పదవి నుంచి తొలగించండి


సబ్ కలెక్టర్ అనూప్ పండాకి వినతి పత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన సమితి పంచాయతీ సర్పంచి సునీత మల్లిక్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ అనూప్ పండాను కలిసి వినతి పత్రం అందజేశారు. 2022లో బాధ్యతలు చేపట్టిన నుంచి అధికార దుర్వినియోగం, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్యనిర్వహణ అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. సభ్యులు రసానందో పాణి, నర్తమ్ పాత్రో, కున్ని మిశ్రా తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ముగిసిన గజలక్ష్మీ ఉత్సవాలు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం డివిజన్‌లో నిర్వహిస్తున్న గజలక్ష్మీ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. రైల్వేస్టేషన్ రోడ్, పద్మపురం తదితర చోట్ల అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి వంశధార నదిలో నిమజ్జనం చేశారు.

నందన్న ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా రామన్నగుడ సమితిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన నందన్న ఉత్సవాలు, గజలక్ష్మీ వేడుకల్లో గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, పురసంస్థ ఉపాధ్యక్షుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గొట్ట గ్రామంలో నందన్న ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రసాద సేవనానికి విశేష స్పందన



రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక న్యూకాలనీలో 29వ వార్షిక గజలక్ష్మీ పూజల్లో భాగంగా ప్రసాద సేవనం జరిగింది. గురువారం సింధు భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ మలంచా ప్రాంతంలో ఉన్న శ్రీ తిరుపతి వెంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, సభా ప్రార్థన, విశ్వక్సేనపూజ, రక్షాబంధనం, నీరాజనం, మంత్ర పుష్పాలు, అంకురార్పణ తదితర కార్యక్రమాలు జరిగాయి.

కాళీమాత పూజలకు సన్నాహాలు...



పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని నెహ్రూ కూడలి వీదిలో కాళీమాత పూజలకు బుధవారం రాత్రి ముహూర్తపు రాట జరిగింది. ఈ ఏడాది 46వ వార్షికోత్సవ క్రతువులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భద్రక్‌లో మరపడవలు బోల్తా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భద్రక్ జిల్లాలోని ధమ్రా చేపల రేవు పరిధిలో లంగరు వేసి ఉన్న రెండు మరపడవలు గురువారం మధ్యాహ్నం యాంత్రిక లోపంతో ఇసుకలో కూరుకుపోయి ఒక వైపునకు ఒరిగాయి. కెరటాల ఉద్ధృతి పెరగడంతో మరమ్మతు చేసే పరిస్థితి లేక అలాగే వదిలేశారు.


ధమ్రా చేపలరేవు పరిధిలో దృశ్యమిది

ఆదివాసీ విద్యార్థుల గుర్తింపు గర్వకారణం


దనపతిను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కడం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో ఇటీవల ఓఏఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణతులైన ఆదివాసీ విద్యార్థులను పొట్టంగి ఎమ్మెల్యే రామ్ చంద్ర కడం అభినందించారు. నందపూర్ సమితి రాయ్ సింగ్ పంచాయతీ చిలిపుట్ జయ రామ్ బోడో నాయక్, లమతపుట్ సమితి ఉంబేల్ గ్రామ పంచాయతీ టెంతాలి పొడ గ్రామానికి చెందిన దనపతి సీసాలను నందపూర్ సమితి కేంద్రంలోని ఎమ్మెల్యే సత్కరించారు. సమితి అభివృద్ధి అధికారి దుర్గా ప్రసాద్ దొర అధ్యక్షతన సమితి అధ్యక్షురాలు సావిత్రి కర్తుల్, ఎస్‌డీపీఓ సంబిత్ కుమార్ మజ్జి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామేష్ కమూడి తదితరులు ఉన్నారు.

చిత్రకొండ సమితిలో పాలనాధికారి పర్యటన


ప్రజలతో మట్లాడుతున్న పాలనాధికారి

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి పాలనాధికారి ఆశిష్ ఈశ్వర్ పాటిల్ గురువారం చిత్రకొండ సమితిలో పర్యటించారు. చిత్రకొండ సమితిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పాలనాధికారికి అందజేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన


రొగాయిలొండ పునరావాసకేంద్రంలో గంజాం పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ నియోజకవర్గంలోని తీర గ్రామాల ప్రజల్ని గంజాం జిల్లా యంత్రాంగం పునరావాసకేంద్రాల్లో చేర్పించింది. అక్కడ ఆహారం, తాగునీరు ఏర్పాటు చేయడంతోపాటు వైద్య చికిత్స సౌకర్యాలు కల్పించారు. బుధవారం రాత్రి పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ, ఇతర ఉన్నతాధికారులు పునరావాస కేంద్రాలకు వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురువారం మధ్యాహ్నం సరికల్లా 4 వేలా మందిని తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని పొట్టంగి ఎమ్మెల్యే రామ్ చంద్ర కడం వైద్యులను ఆదేశించారు. నియోజకవర్గం పరిధిలో గురువారం ఉదయం కుందిలి, పొట్టంగి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పర్యటించి పనితీరు పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. . రెండు ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన రోగి కళ్యాణ సమితి సమావేశంలో పాల్గొని సమీక్షించారు. ఆరోగ్య కేంద్రం పనితీరు, తాజా పరిస్థితి, సదుపాయాల కొరత, తదితర అంశాలును సమీక్షించారు. ఉత్తమ ఆరోగ్య కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

భాజపా ప్రజలను మోసగించింది

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బిజద పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పిలుపుమేరకు గురువారం గుమ్మ సమితిలో జనసంపర్క యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి, సమితి అధ్యక్షురాలు సునేమి మండల్, యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు. సమితిలోని సంత ప్రాంతం నుంచి పురవీధుల్లో తిరుగుతూ బిజద హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రూపేష్ మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్నికల్లో అమలు చేస్తామన్న హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు.


గుమ్మ సమితిలో పాదయాత్రలో పాల్గొన్న శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి, యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు తదితరులు

నామినేషన్ దాఖలు చేసిన సుభజిత్ రాయ్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ శాసన సభ స్థానానికి ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. భాజపా అభ్యర్థి శుభజిత్ రాయ్ జిల్లా పాలనాధికారి కార్యాలయంలో బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు.



గంజాం జిల్లాలో వర్షాలు


బ్రహ్మపురలోని ఫైర్ స్టేషన్ రోడ్డులో వర్షంతో పలుచబడ్డ జన సంచారం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో గంజాం జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. వివిధ చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బ్రహ్మపురలో ఉదయం నుంచి ఆగాగి జల్లులు కురవగా, మధ్యాహ్నం నుంచి వాన జోరు పెరిగింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో జన సంచారం పలుచబడింది.

ఆసుపత్రుల్లో 367 మంది ప్రసవం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని మారుమూల, కొండ ప్రాంతాల్లో ఉంటున్న నిండు గర్భిణులను తుపాను హెచ్చరికల నేపథ్యంలో సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, మా గృహాలు, ఆసుపత్రులకు తరలించారు. గురువారం రాత్రి సరికి మొత్తం 599 మంది గర్భిణుల్ని స్థానాంతరం చేశామని, వీరిలో 367 మంది వివిధ ఆసుపత్రుల్లో బిడ్డలకు జన్మనిచ్చారని జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్ఓ) కార్యాలయం అధికారులు 'న్యూస్‌టుడే'కు చెప్పారు.


ఆరోగ్య కేంద్రంలో గర్భిణి

బియ్యం ఇవ్వడం లేదయ్యా...!


ఈవోతో మాట్లాడుతున్న రెండు వార్డుల ప్రజలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో 3, 4 వార్డుల లబ్ధిదారులకు రేషన్ డీలర్ గత నాలుగు నెలలుగా వేలిముద్రలు తీసుకొని బియ్యం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ బుదవారం ఈవో సిద్ధార్థ్ పట్నాయక్‌ను కలిసి వినతి పత్రాలను అందజేశారు. క్షేతస్థాయిలో పరిశీలించి సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారు. మాజీ కౌన్సిలర్ బాలారయ్ నేతృత్వంలో స్థానికులు ఈవోకి ఫిర్యాదు చేశారు.

బాధ్యతల స్వీకరణ


బిభూదత్‌ను స్వాగతం పలుకుతున్న రాజేంద్ర, తదితరులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ అదనపు కార్యనిర్వాహక అధికారిగా బి.బిభూదత్ సాహు గురువారం బాధ్యతలు చేపట్టారు. భువనేశ్వర్ నుంచి ఆయన ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఆయనను పురఅధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్రో, అసిస్టెంట్ ఇంజినీర్ మనోజ్ పాత్రో తదితరులు స్వాగతం పలికారు.

తీర గ్రామాల్లో పరిస్థితిని సమీక్షించిన మంత్రి బిభూతి జెనా


మార్కండిలోని తుపాను రక్షిత కేంద్రం వద్ద గ్రామస్థులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బిభూతి జెనా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో వాతావరణ అధ్యయన కేంద్రం గంజాం జిల్లాకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. సాగర తీరం, నదులు, చిలికా ఒడ్డున ఉంటున్నవారిని సమీపంలోని తుపాను రక్షిత కేంద్రాలు, తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. రాష్ట్ర ఉక్కు గనులు, రవాణా శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా గురువారం గంజాం జిల్లాలోని చికిటి, రొంగాయిలొండ, ఛత్రపురం, గంజాం, కళ్లికోట సమితిల్లోని తీర గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. రొంగాయిలొండ సమితిలోని మార్కండి గ్రామంలో బహుదా నది కాలువ ముఖద్వారం వద్ద ఇటీవల వివిధ గ్రామాల మత్స్యకారులు చందాలు వేసుకుని శ్రమదానంతో ఇసుక బస్తాలతో తాత్కాలిక గట్టు ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే. మంత్రి జెనా ఆ ఆ గట్టు వద్ద పడవలో కొంతదూరం ప్రయాణించి పరిశీలించారు. ఇక్కడ శాశ్వత జట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి చికిటి సమితిలోని రామయ్యపట్న తీర గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో, బహుళ వినియోగ తుపాను రక్షిత కేంద్రాలకు తరలించిన వారితో మాట్లాడారు. అనంతరం మంత్రి జెనా గోపాలపూర్, అర్జిపల్లి, పోడమ్మపేట తీర గ్రామాల్లో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. ఆయన వెంట గంజాం జిల్లా పాలనాధికారి దివ్య జ్యోతి పరిడా, ఇతర అధికారులున్నారు.


చికిటి సమితిలో రామయ్యపట్నలోని బహుదా నది ముఖద్వారం సమీపాన పడవల్ని భద్రపరచుకుంటున్న మత్స్యకారులు

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు గురువారం సాయంత్రం గంజాయి రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఎస్సై శివన్నారాయణ కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం పసుపులంక గ్రామం నుంచి విజయవాడ తరలిస్తున్న రూ.10 వేల విలువైన రెండు కిలోల గంజాయి పట్టుబడింది. విజయవాడ పంజా కూడలికి చెందిన షేక్ రిజ్వాన్, కేఎల్‌రావు నగర్‌కు చెందిన కూరగంటి సుభాష్‌లను అరెస్టు చేసి రంపచోడవరం కోర్టుకు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రెండు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ఏఎస్సై రాజేశ్వరరావు, హెచ్‌సీ పురుషోత్తం, కానిస్టేబుళ్లు ఈశ్వరరావు, ఎన్ఆర్‌కే రాజు, ఏఆర్, ఏపీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

'బోద' బాధితులకు అవగాహన


శుభ్రత గురించి వివరిస్తున్న వైద్యాధికారిణి క్రాంతికిరణ్మయి

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో అతిసారం బాధితులకు వ్యక్తిగత శుభ్రతపై బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి అవగాహన కల్పించారు. గ్రామంలో ఫైలేరియా లేకుండా చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు దృష్టి సారించారు. రోగుల వద్దకు వెళ్లి గాయాలను శుభ్రం చేసుకోవడంపై వివరించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

ప్రసవ సమయంలో బాలింత మృతి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ప్రసవ సమయంలో బాలింత మృతి చెందిన ఘటన ఖరగ్‌పూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఖరగ్‌పూర్ గ్రామీణ ప్రాంతం రౌత్‌మణిపూర్ గ్రామానికి చెందిన 24 ఏళ్ల మమునీ సర్దార్ సింగ్ అనే గర్భిణి పురిటి నొప్పులతో డేబ్రా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం చేరింది. మంగళవారం శస్త్రచికిత్స చేయగా ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చి కన్నుమూసింది. ఆపరేషన్ అనంతరం అధికంగా రక్తస్రావమై మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. స్థానికుల మద్దతుతో ఉద్రిక్తతకు దారి తీసింది. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ సౌమ్య శంకర్ షడంగి డేబ్రా ఆసుపత్రికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ ఘటనపై వాస్తవాల వెలికతీతకు ఓ కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. సహాయ వైద్యాధికారి (తృతీయ) సుదీప్‌కుమార్ మండల్‌తో కూడిన ముగ్గురు సభ్యులు గల కమిటీ వేసినట్టు ప్రకటించారు. మృతదేహాన్ని పరీక్షకు తరలించారు.


ఆందోళనలో బంధువులు, స్థానికులు

సప్తాహ పూజలు



సీతానగరం: స్థానిక వేణుగోపాల ఆలయ ప్రాంగణం గురువారం భక్తులతో కిటకిటలాడింది. రుత్వికులు మత్తిరుమల రంగనాథం అయ్యంగారు ఆధ్వర్యంలో భాగవత సప్తాహ యజ్ఞ పూజలు, పారాయణం, విష్ణు సహస్రనామాలు చేపట్టారు. లక్ష్మీనృసింహునికి ముడుపుల పూజలు జరిగాయి.

● జిల్లాలో 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 9,741 మంది గర్భిణులు, 11,044 మంది బాలింతలు, 0-6 ఏళ్ల లోపు వయసు ఉన్న చిన్నారులు 55,741 మంది ఉన్నారు.


ఎం.రుప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణవాడికకు స్థలం సిద్ధం చేస్తున్న అధికారులు

అంగన్‌వాడీల్లో.. ఆరోగ్యం..ఆహ్లాదం..ఆనందం

సక్షం పథకంలో 153 కేంద్రాలు ఎంపిక

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, బలగ(శ్రీకాకుళం)

ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ, ఆరోగ్యంపై అవగాహన, కిశోర బాలికల వికాసంతో సంపూర్ణ ఆరోగ్యవంత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఇందుకు తగిన వసతులు, సౌకర్యాలు లేక వందశాతం ఫలితాలు అందుకోలేక చతికిల పడుతున్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అడుగులేస్తోంది. మెరుగైన వసతుల కల్పన లక్ష్యంగా కేంద్రాల్లో 'సక్షం' (స్టిమ్యూలేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లాలో 14 ప్రాజెక్టుల పరిధిలోని 25 మండలాల్లో ఉన్న 153 అంగన్‌వాడీ కేంద్రాలు ఈ కార్యక్రమానికి ఎంపికయ్యాయి.

పోషకాహారం.. శుద్ధ జలం

పోషకాల తోట(న్యూట్రి గార్డెన్) పేరిట ఎంపికైన కేంద్రాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. వాటిని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తారు. రక్షిత మంచి నీటిని అందిచేందుకు శుద్ధి యంత్రాలు అమర్చనున్నారు. వీటి నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది.

ఒక కేంద్రానికి కేటాయించే నిధుల వివరాలు (రూ.)

పోషకాల తోటకు	- 10,000
ఇంకుడు గుంతలు	- 16,000
ఇతర సదుపాయాలు	- 19,800

సమకూరనున్న సదుపాయాలు

- తల్లీబిడ్డలు ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు, కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం
- విద్యా బోధన మెరుగుకు అవసరమైన చర్యలు
- పరిజ్ఞానం పెంపొందిచేందుకు కేంద్రంలో వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువుల ఏర్పాటు
- బల్లలు, కుర్చీలు, ఫర్నీచర్ అందుబాటులోకి తీసుకు రావడం
- ఆకట్టుకునే విధంగా బోధనకు, దృశ్య శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు ఉంచడం

మంచి ఆహారం అందిస్తాం ... జిల్లాలో 153 కేంద్రాలు సక్షం పథకానికి ఎంపికయ్యాయి. వీటిలో పోషక తోటలు, ఇంకుడు గుంతలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం నిధులు సైతం విడుదల చేసింది. కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణంతో పాటు పోషకవిలువలు కలిగిన ఆహారం అందిస్తాం. - బి.శాంతిశ్రీ, ఐసీడీఎస్, పీడీ

అంత్యక్రియలకు అగచాట్లు..!


సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల్లోని పలు గ్రామాల్లో శ్మశానవాటికలు ఉన్నా వాటికి మృతదేహాలను తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కిలో మీటర్ల మేర తుప్పలు, పొలాల గట్లపై నుంచి నడిచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కొన్నేళ్ల కిందట శ్మశానవాటికలను నిర్మించినా ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో చెరువుల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం



గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఆమదాలవలస మండలం రామచంద్రాపురంలో శ్మశానవాటిక (స్వర్గధామం)ను ఎంపీ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఎనిమిదేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు దాన్ని ప్రారంభించకపోవడంతో స్వర్గధామానికి వెళ్లేందుకు దారి లేక అక్కడ పక్కనే ఉన్న చెరువులో మృతదేహాలను దహనం చేయవల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్గధామాన్ని వినియోగంలోకి తెస్తే వారికి ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

సరుబుజ్జిలి మండలంలోని సుభద్రాపురం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే శ్మశానవాటిక దగ్గరకు వెళ్లాలంటే సుమారు అర కిలోమీటరు దూరం దాటే ఉంటుంది. అక్కడికి చేరుకోవడానికి రహదారి సదుపాయం లేకపోవడంతో పంట పొలాల గట్ల పైనుంచి వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో ఎవరైనా మృతి చెందితే ఇక్కడి ప్రజల అవస్థలు చెప్పుకోలేనివి. తీరా శ్మశానవాటిక వద్దకు చేరుకుంటే స్థల సమస్య పట్టిపీడిస్తోంది. దీంతో గుర్తించిన ఈ నిద్రగన్నేరు చెట్టు కిందనే మృతదేహాలను దహన పరుస్తున్నారు.



చర్యలు తీసుకుంటాం..

పరిశీలించి శ్మశానవాటికలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు, స్థల, రహదారి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

–రామారావు ఈవోపీఆర్డీ, ఆర్.వెంకటరావు ఎంపీడీవో, సరుబుజ్జిలి, ఆమదాలవలస

రోడ్డుపై కోత.. ప్రయాణానికి అవస్థ



ఇచ్ఛాపురం పురపాలకసంఘ పరిధి బంగ్లారోడ్డు-లాలాపేట కూడలిలో రహదారి మధ్యగా ఉన్న కల్వర్టు కారణంగా రోడ్డు మధ్యలో చీలిక ఏర్పడి, వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. లాలాపేట, రైలునిలయం, పురపాలకసంఘ కార్యాలయం, బాలికల జూనియర్ కళాశాల, బంగ్లాలకు వెళ్లేవారు ఈ కోత రోడ్డును దాటాల్సి ఉంటోంది. ముఖ్యంగా విద్యార్థుల రాకపోకల సమయంలో ప్రమాదానికి గురవుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు రమేష్ తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మొదలైన విదేశీ పర్యాటకుల సందడి

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: ప్రకృతి అందాలకు నెలవైన కొరాపుట్ జిల్లాలో విదేశీ పర్యాటకుల తాకిడి మొదలైంది. లమతపుట్ సమితిలోని ఒనకడిల్లీ వారపు సంతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ సంతకు బోండా, గదబ ఆదిమజాతి తెగకు చెందిన మహిళలను చూసేందుకు విదేశీ పర్యాటకులు వస్తుంటారు. గురువారం స్విట్జర్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల నుంచి 20 మంది వరకు వచ్చారు. బోండా మహిళలు ధరించే ఆభరణాలు కొనుగోలు చేసి వారితో ఫోటోలు తీసుకొని కొంత నగదు చెల్లిస్తుంటారు.


బోండా మహిళతో స్విట్జర్లాండ్ మహిళ

27.5 కిలోల గంజాయి స్వాధీనం

చేబ్రోలు, న్యూస్‌టుడే: నలుగురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని గుంటూరు జిల్లా చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో పొన్నూరు గ్రామీణ సీఐ కోటేశ్వరరావు గురువారం వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నవనంపాడుకు చెందిన రాజా, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా మౌపోదర్‌కు చెందిన సంతోష్‌గౌడ్ చేబ్రోలు సమీపంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేసేందుకు వచ్చారు. వారికి గంజాయి తాగే అలవాటు ఉండటంతో వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన గంజాయి విక్రేత థామస్‌పాల్‌తో పరిచయం ఏర్పడింది. ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తే అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో ముగ్గురు కలిసి 10 రోజుల కిందట అక్కడ అటవీ ప్రాంతం నుంచి 27.5 కేజీల (రూ.5 లక్షల విలువ) గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం గంజాయి విక్రేతలైన పొన్నూరుకు చెందిన షేక్ ఫజిల్, నారాకోడూరుకు చెందిన వెలగా విజయ్‌సాయి, ఒడిశాకు చెందిన ప్రశాంత్‌మాలిక్‌తో కలిసి పైముగ్గురు చేబ్రోలులో గంజాయి పంచుకుంటుండగా.. పోలీసులు దాడి చేశారు. విజయ్‌సాయి, ప్రాశాంత్ మాలిక్ పారిపోగా మిగిలిన నలుగురిని అరెస్టు చేశారు.

6 లక్షల చేప పిల్లల విడుదల


జలాశయంలో చేప పిల్లలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: మత్స్యకారులు చేప పిల్లలను పెంచుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గురువారం తోటపల్లి జలాశయంలో 6 లక్షల చేప పిల్లలను అధికారులతో కలిసి ఆమె విడుదల చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి తిరుపతయ్య, మండల తెదేపా అధ్యక్షుడు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.తవిటినాయుడు, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన

వీరఘట్టం, న్యూస్‌టుడే: పొట్టదశలో వరి పంటను సమగ్రంగా పరిశీలించాలని ఏవో జె.సౌజన్య అన్నారు. కంబరలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సస్య రక్షణ చర్యలు, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పురుగు, తెగుళ్ల ఆశిస్తే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సమన్వయకర్త కాంచనమాల, ఐసీఆర్‌పీ ఎం.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పని చేయిస్తే కేసులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బాల కార్మికులతో పనులు చేయిస్తే కేసులు పెడతామని పాలకొండ కార్మికశాఖ సహాయాధికారి ఆర్.వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాలను పరిశీలించి యజమానులకు సూచనలు చేశారు. సిబ్బంది పి.శ్రీధర్, క్రాంతి, ప్రవీణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

రాత్రివేళ.. కుక్కల బాధ



ఇచ్ఛాపురం పట్టణంలో రాత్రివేళ ప్రయాణికులు, ఆసుపత్రులకు వెళ్లేవారు కుక్కల స్వైరవిహారం చూసి భయాందోళనలకు గురవుతున్నారు. ప్రాంతాల వారీగా బృందాలుగా ఏర్పడిన గ్రామసింహాల గుంపు రోడ్లపై స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని కూడా వదలడం లేదు. ఇక నడిచి వెళ్లేవారు చేతిలో కర్రనో, రాయినో పట్టుకుని ముందుకు సాగాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.


–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఎవరికీ పట్టని అమ్మ వేదన..!

● శ్రీనివాస్ అనే వ్యక్తి దేవుడి జన్మనక్షత్రంలో తన బిడ్డ జన్మించాలని ఆకాంక్ష. దీంతో భార్యకు ప్రసవం వచ్చేంతవరకు వేచిచూడకుండా ముందుగానే శస్త్రచికిత్స ద్వారా కాన్పు జరిపించారు.

● ఈశ్వర్ భార్య గర్భిణి. మరో వారంరోజుల్లో అమావాస్య ఉందని, శ్రావణమాసం దాటాక వచ్చే భాద్రపదం అంతగా అనుకూలించేదికాదని పేర్కొంటూ ప్రసవ తేదీకి పది రోజుల ముందే శస్త్రచికిత్స చేయించారు.


● శ్రీజ అనే గర్భిణి ప్రసవ వేదనతో పలాసలోని ఓ ఆసుపత్రిలో చేరింది. ఆమె భర్త వైపు కుటుంబ పెద్ద మరోవారం తర్వాత మాత్రమే మంచి ముహూర్తం ఉందని, అప్పుడు మాత్రమే ప్రసవం చేయాలని వైద్యులకు సూచించారు. అప్పటి వరకు ఆగితే బిడ్డ ఉమ్మనీరు మింగేసే ప్రమాదముందని, తల్లి ఆరోగ్యం సహకరించే పరిస్థితి లేదని హెచ్చరించినా ముహూర్తమే ముఖ్యమని వారంరోజులు ఆగాకే ప్రసవం చేయించారు.




..అమ్మతనం.. ప్రపంచంలో అపురూపమైన అవకాశం. ప్రతి మహిళ జీవితంలో తల్లిగా మురిసిపోవాలనుకుని నవమాసాలు ఎదురు చూస్తుంది. గర్భిణిగా తన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. కానీ ప్రసవ సమయంలోనే జరుగుతున్న తంతు ఆందోళనకు గురిచేస్తోంది. ప్రసవ వేదన అనుభవించలేక కొందరు.. ముహూర్తాల మూఢ నమ్మకంలో మరికొందరు.. వైద్యుల వ్యాపార దృక్పథంలో ఇంకొందరు శస్త్రచికిత్సల వైపే అడుగులేస్తున్నారు. రోజురోజుకూ సాధారణ ప్రసవాలు తగ్గిపోతుండగా సిజేరియన్ల సంఖ్య జిల్లాలో పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ ధోరణి మరింత దారుణంగా ఉంది.

- న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం, గుజరాతీపేట (శ్రీకాకుళం)

జిల్లాలో గత రెండేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల తీరు..



జనవరి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు జరిగిన కాన్పులను పరిశీలిస్తే..



టెక్కలి జిల్లా ఆసుపత్రిలో తల్లీ పిల్లల వార్డు



శస్త్రచికిత్స ప్రసవాలతో తల్లీ బిడ్డల ఆరోగ్యంపై ప్రభావం

ముహూర్త మూఢాచారాలతో వైద్యులపై ఒత్తిడి

ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల వ్యాపారం

బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం..

శస్త్రచికిత్స ప్రసవాలు తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శిశువుల్లో వ్యాధినిరోధకశక్తి తక్కువ ఉంటుందని, వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పుట్టిన కొద్దిసేపటికే తల్లిపాలు అందించే అవకాశం సాధారణ ప్రసవాలకే ఉంటుందని, దీని ప్రభావం బిడ్డ ఆరోగ్యంపై పడుతుందని పేర్కొంటున్నారు. ఎనస్తీషియా మొదలు శస్త్రచికిత్స జరిపే వరకు జరిగే ప్రక్రియ, రక్తస్రావం వంటివి తల్లి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రసవానంతరం గర్భసంచి, ఇతర అనారోగ్య సమస్యలు సిజేరియన్‌లో జరిగే లోపాల వల్లే ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

నిర్వాహకుల కమీషన్ ఎర..

శ్రీకాకుళం నగరం, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట పట్టణాలు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వీటి నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లోని ఆశా, ఆరోగ్య కార్యకర్తలను ఎరగా వాడుకుంటున్నారు. కాన్పులకు తమ వద్దకు తెస్తే వారికి ప్రత్యేకంగా నజరానాలు అందజేస్తున్నారు. శస్త్రచికిత్స చేస్తే వచ్చే కమీషన్ కోసం సిబ్బంది కూడా గర్భిణులకు సిజేరియన్ల వైపు వెళ్లేలా చూస్తున్నారు. వీటిని నివారించే ప్రభుత్వ వ్యవస్థ మిన్నకుండిపోతుంది తప్ప ఏమీ చేయలేకపోతోంది. అధికారులు సైతం సమీక్షలకే పరిమితమవుతున్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి...

జిల్లాలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని వైద్యులను ఆదేశించాం. ప్రభుత్వ వైద్యాధికారులు సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణుల కుటుంబ సభ్యుల్లో మార్పు రావాల్సి ఉంది. జాతకాలు, మూఢ నమ్మకాల కారణంగా ఒత్తిడి తీసుకురావడంతో కొంతవరకు వైద్యులు శస్త్రచికిత్సలు చేస్తున్నారని సమాచారం. – బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్‌వో

పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. క్రమం తప్పకుండా పిల్లలను కళాశాలకు పంపించాలన్నారు. వారు తరగతులకు హాజరు అవుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు: పార్వతీపురం గ్రామీణం, పట్టణం: ఆటోలు, వ్యాన్‌లలో వచ్చే వారు రహదారి భద్రత నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ సత్యనారాయణ సూచించారు. గురువారం పట్టణ శివారులో తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో ఉన్న వాహనాలను పరీక్షించి అవగాహన కల్పించారు.